

# మైసూరు : సుగంధపరిమళం

**ప్రియమైన "కధానిక" బ్లాగ్ పాఠకులకి మకర సంక్రాంతి శుభాకాంక్షలు.**

**మూడురోజుల పెద్దపండుగ సందడిగా సరదాగా గడుపుకున్నారని ఆశిస్తున్నాను.**

క్రిందటి సంవత్సరం మేము యీపండుగ సందర్భముగా కూర్గ్ వెళ్ళాము. కూర్గ్ విషయాలు "కాఫీ ఘుమఘుమలు - కొడగు అందాలు" అన్న శీర్షికతో బ్లాగ్‌లో వచ్చిన నా రచనను చదివేవుంటారు. మావారి పుట్టినరోజు, భోగి .. ఒక్కరోజే. అందుకే ఇది మాకు ఒక విశిష్టమైన పెద్దపండుగ. ఈసంవత్సరం యెక్కడికివెళ్ళామా....అని యిద్దరమూ ఆలోచించి మైసూరు వెళ్దామని నిర్ణయించుకున్నాము. మాకు మైసూరు అంటే ఒక ప్రత్యేకమైన అభిమానము. మాజీవితంలో ఒక విశిష్టత. మాపెద్దకోడలు మైసూరు అమ్మాయి. అబ్బాయి పెళ్లి మైసూరులోనే అయింది. మామనవరాలు ఆవూళ్లూనే పుట్టింది. ఇన్నికారణాల వల్ల మామనసులో మైసూరు యెప్పుడూ మంచిగంధమే. సరే యింతకన్నా మంచి వూరు యేముందికదా! వుత్సాహంగా ప్రయాణ సన్నాహాలు మొదలుపెట్టాము. ఇంకొక విశేషము యేమిటంటే యీ పుట్టినరోజుతో మావారు డభైఅయిదవ సంవత్సరంలోకి అడుగుపెట్టారు. అంటే ప్లాటినమ్‌సంవత్సరము అన్నమాట. ఇన్ని విశేషాలతో మాకు పండుగ హడావిడి మొదలైంది.

జనవరి 11తేదీ 2015సంవత్సరం.

మేము వుంటున్నది బెంగుళూరు...మైసూరు కారులో ప్రయాణం మూడుగంటల్లో చేరిపోవచ్చు. మంచి డ్రైవర్‌ని పిలిచాము. అతను నిరుడు మమ్మల్ని కూర్గ్ తీసికెళ్లాడు. అతను కేవలం డ్రైవర్‌లా కాకుండా మాకు చేదోడువాదోడుగా వుంటాడు.




జనవరి 11 తేదీ ఆదివారం వుదయం వుష్మోతిని స్నానాలు ముగించుకుని ప్రయాణానికి సిద్ధం! డ్రైవర్ కూడా వచ్చేశాడు. సామాన్లు లోడ్ చేసుకుని కులాసాగా కూనిరాగాలు తీసుకుంటూ బయలుదేరాము. మాప్రయాణం చాలా ఆహ్లాదకరంగా సాగింది. బెంగుళూరు మైసూర్‌రోడ్ మీదుగా బిడాది, రామ్‌నగర్, చెన్నపట్న, మద్దూరు, మండ్య, శ్రీరంగపట్నం ... అంతే మైసూరు వచ్చేశాము. మండ్య దాటగానే మంచి హోటల్ వుంది. మామూలు హోటల్ కాదు, It was like an American హైవే Eatout. Food Court చాలా శుభ్రంగా వుంది. అక్కడే భోజనం ముగించుకుని తిన్నగా హోటల్ చేరుకున్నాము. Fortune JP Palace 5-Star హోటల్ ITC Groupకి చెందినది. ఎక్కువగా




విదేశీపర్యాటకులు వస్తూవెళ్తూ కళకళ్లాడుతూ కిటకిటలాడుతోంది. మైసూరు దగ్గరలో ముఖ్యమైన "Tibetan" కాలనీ వుండడంతో పెద్ద గ్రూపుల్లో జపాన్ నుండి పర్యాటకులు వస్తుంటారు. మైసూరు సహజమైన పర్యాటక అవ్వడం కేంద్రం వలన హోటల్ సిబ్బంది గూడా చాలా మర్యాదగా వున్నారు.





రూమ్‌లో అన్నీ సర్దుకుని కాస్త విశ్రాంతి తీసుకున్నాము. మేము ముఖ్యంగా చూడాలనుకున్నవి....Palace, Zoo మరియు చాముండి అమ్మవారి గుడి. ప్రతి ఆదివారం Palace దీపాలంకరణ సాయంత్రం ఏడు గంటలకి వుంటుందిట.

మరింకేం!!



ఆరోజు ఆదివారం కదా...ఎగిరి గంతు వేశాము. సాయంత్రం అక్కడికి మేము హాజర్. నిజంగా ఆదీపాలంకరణ చూడడం ఒక కళ్లపేడుక. రాజులు కాలగర్భంలో కలిసిపోయారు-రాచరికాలు అంతరించాయి. కానీ ఆదీపాల వెలుగులో కోట మెరిసిపోతోంది. నిజంగా రాజు రాణీ అక్కడే వున్నారని మనకి అనిపిస్తుందంటే అతిశయోక్తి కాదు.



ఈరోజుకీ కోటని చెక్కుచెదరకుండా కాపాడుకుంటున్న కన్నడ ప్రజానీకానికి యివే మాజోహార్లు. విశాలమైన ఆవరణలో నలుపక్కలా దేవాలయాలతో తోటలూ పెద్దపెద్ద వృక్షాలూ చక్కగా అమిరివున్న కోట నిర్మాణములో మూడుమతాల సంస్కృతి యీ ప్రతిబింబిస్తోంది. అంటే హిందూ, క్రైస్తవం మరియూ ముస్లిమ్ . నిజంగా ఆనాటి ప్రభువులకి యెంత దూరదృష్టి! యెంతటి మతసమన్వయం!! నాకు చాలా ఆనందం కలిగింది. అంతపెద్ద కోట ఆవరణ దీపాలవెలుగులో పట్టపగలు వలె కాంతులీనుతోంది. ఆవరణ నడిచి తిరగలేని మాలాంటి సీనియర్సుకి, యింకా చంటిపిల్లలున్న వారికీ సదుపాయంగా Electric cars అందుబాటులో వున్నాయి. అందువలన మేము శ్రమలేకుండా కోట ఆవరణ చుట్టి వచ్చాము.



మర్నాడు ముందుగా కోటలోపల చూద్దామని నిశ్చయించుకుని దీపాలంకరణ చూసిన ఆనందంతో హోటల్‌రూమ్‌కి వచ్చేశాము. తృప్తితో మనసు నిండగా హాయిగా నిద్రపోయాము. మరునాడు జనవరి 12వ తేదీ. వుదయం హోటలువారి సౌజన్యంతో యేర్పాటుచేసిన అల్పాహారం...అది అల్పాహారమా! యెన్నో రకరకాల పళ్లూ, పానీయాలూ, మధురమైన పిండివంటలూ అబ్బో! కానీ



మేము తినగలిగేది అల్పమే... అందుకే అది మాకు అల్పాహారం ముగించుకుని మైసూరుకోటకి చేరుకున్నాము. కోటలోపల తిరగడానికి Wheel Chair సదుపాయం వుంది. అది యేర్పాటు చేసుకుని ఉవ్విళ్లూరుతున్న మనసుతో కోట లోపలికి అడుగుపెట్టాము. అబ్బా! యేమని వర్ణించగలను కదా! అద్భుతమైన కట్టడం. అంతా బర్మాటేకు కలప, బెల్జియం అద్దాలతో నిర్మితమైన కళాఖండం. ఆనాటి రాజులకి కళాహృదయం వుందని నిరూపించబడిన ఆవైభవం చూస్తేనే మనసు పులకరించిపోయింది. రెండు దర్బారుహాలులు, కుస్తీపోటీల మైదానం, ఒకటేమిటి కదా... కళామతల్లి అక్కడే కొలువైంది. పువ్వులూ లతలూ తలుపులమీద చిన్నచిన్నగా చెక్కబడినవి కూడా విపులంగా వున్నాయి. వెండి ద్వారాలూ, బంగారు సింహాసనాలూ .... ఆనాటి ప్రభువులు యెంతటి సౌందర్యపోషకులో! ప్రజల్ని



కన్నబిడ్డలవలె చూసుకునేవారని యిప్పటికీ కన్నడిగులు తల్చుకుని మురిసిపోతూనే వున్నారు. వారికి శ్రేయోభిలాషులు అర్పించిన వివిధ బహుమానాలూ కానుకలూ అందంగా అమర్చబడి చూపరులను యిట్టే ఆకర్షించుకుంటూన్నాయి. 500 సంవత్సరాలకు పైగా కన్నడ దేశాన్ని



పాలించిన వడయారు రాజులు, రాణీలయొక్క నిలువెత్తు "Paintings" సజీవంగా అలంకరించబడ్డాయి. వారు నిత్యమూ పూజించి సేవలు చేసుకునే దేవీ-దేవతా మూర్తులు అక్కడే కొలువై పర్యాటకులని ఆశీర్వదిస్తున్నారు. ఇంతటి వైభవమైన కోటని యెంతచూసినా మాకు తనివి తీరలేదు. ప్రతి సంవత్సరం దసరా వుత్సవాలు చాలా ఆర్భాటంగా చేస్తారు. మైసూరు దసరా వుత్సవాలు లోకప్రసిద్ధం. కోటకి ముందు గజరాజులూ, కోటలోకి అడుగుపెడ్తూనే



దసరావుత్సవాలికి గజరాజులకి అలంకరించే నగలు మనని యిట్టే ఆకర్షిస్తాయి. మైసూరు సంస్థాన రాజులు వడయారులు. 14వ శతాబ్దంలో ప్రారంభమైన యీ రాజవంశ పరిపాలన 1971లో భారతప్రభుత్వం Princely States abolish చెయ్యడంతో నిర్వీర్యమయ్యింది. అయినా వారి మైసూరు, బెంగళూరు రాజప్రాసాదాలూ, మ్యూజియములూ, వడయారులు స్థాపించిన జంతు ప్రదర్శన శాలలూ, దేవాలయాలూ యింకా వారి అధ్వర్యంలోనే నడుస్తున్నాయి. ఈ వడయారు వంశంలో శ్రీ చామరాజ వడయారు, శ్రీ కృష్ణ రాజేంద్ర వడయారు ప్రసిద్ధులు.

కావేరీనది మీద వున్న కృష్ణరాజసాగర్ డామ్, బ్రుందావన్ gardens, మైసూరులోని జంతుప్రదర్శనశాల వారు నిర్మించినవే. శ్రీ చామరజ వడయార్ X, 1894 సం:లో అస్తమించగా వారి మహారాణి శ్రీమతి వాణీవిలాస్ సన్నిధాన, 1897లో మైసూరు రాజప్రాసాదాన్ని English Architect Henry Irwin సారధ్యంలో ప్రారంభించారు. 1912 లో ఈ మైసూరు పేలస్ నిర్మాణం



పూర్తయ్యింది. ఆఖరిగా శ్రీకంఠ దత్త నరసింహరాజ వడియారు పోయినసంవత్సరం కాలంచేశారు. వారికి సంతానభాగ్యం లేకపోవడం వలన మహారాణీ శ్రీ ప్రమోదాదేవి రాచవ్యవహారాలు చక్కబెంటుకుంటున్నారు. యెవరిని దత్తత తీసుకుని వడయారు వంశపు నూతన మహరాజుగా పట్టాభిషేకం చేస్తారో యింకా తెలలేదు. ప్రభుత్వం-రాజసంస్థానం కలిసి కోట నిత్యావసరాలకి అయే వ్యయం భరిస్తున్నారు. అది



అంత సామాన్య ప్రక్రియ కాదు. నిత్యకళ్యాణం-పచ్చతోరణంలా కోట మూడువందలా అరవైఅయిదు రోజులూ నిత్యనూతనంగా మెరిసిపోవాలంటే సిబ్బంది చాలా శ్రమించవలసిందే. అది వారు నెరవేరుస్తున్నారని నానమ్మకం. ఏదేశమైనా యేరాష్ట్రమైనా ఆసంస్కృతి కాపాడుకోవడం చాలా ముఖ్యం. అది మైసూరువాసులు పరిపూర్ణంగా సగర్వంగా అమలుపరుస్తున్నారు. స్వతహాగా మృదుస్వభావులన వీరు యీవిషయంలో మాత్రం దిట్టలే!! మనసునిండిన ఆనందంతో భోజనం ఒక లోకల్హోటల్ "Sidharta"లో చేశాము. మైసూరు ఒకపర్యాటకకేంద్రం కదా! హోటళ్ళకి కొదవేలేదు. నోరూరించేరుచులతో పసందైనఘుమఘుమలతో మనల్ని ఆకర్షిస్తూ ఆహ్వానిస్తాయి. South Indian Thali కడుపు నిండా తిన్నాము.

సరదాగా వుంది. సినిమాకి వెళ్లాము... మైసూరు మాల్‌లోని I-Maxలో 'గోపాలా-గోపాలా'. ఆసాయంత్రం విశ్రాంతిగా హోటల్‌రూమ్‌లోనే వున్నాము. మర్నాడు జనవరి 13. మావారి పుట్టినరోజు. అర్థరాత్రి సరిగ్గా 12గంటలకి మాచిన్నకోడలు శుభాకాంక్షల Phone call తో హడావిడి



మొదలైంది. అందరూ ఫోన్స్ చేసి యీయనకి శుభాకాంక్షలు చెప్పి అభినందించారు . ఇవన్నీ ఒకయెత్తు ...అమెరికా నుండి మామనవరాలు తాతకి ప్రత్యేకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పి తాతని మైమరపించింది. మా అబ్బాయి, కోడలూ కూడా అభినందించారు. మాకు ఆనందంతో మనసు నిండిపోయింది. నిన్నటిలాగే అల్పాహారం ముగించుకున్నాము. 'అమ్మదర్శనం' చాముండేశ్వరి, అందరికీ అమ్మ. ఆతల్లి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చిన్నమూర్తి ఆవిడ. మైసూరు దగ్గర కొండమీద కొలువై వున్న అమ్మ 'చాముండేశ్వరి తల్లి' మైసూరురాజులు నిత్యమూ ఆవిడని పూజించుకుంటారు. ఆవిడ ప్రసాదం నోట్లో వేసుకున్నాకే వారి పనులు ప్రారంభిస్తారు. ఆ జగదంబ మమ్మల్ని కరుణించి



తన చల్లనిచూపులతో మమ్మల్ని ఆశీర్వదించింది. పునీతులమైనాము. గుడి ద్వారం బయట మహిషాసురుడు అమ్మకి కాపలాగా నిలువెత్తు విగ్రహరూపంలో మనకి దర్శనమిస్తాడు. అక్కడికి కొంతదూరంలో 'నందీశ్వరుడు' ఒంటరిగా వున్నాడు. మనల్ని తన మంద్రదరహాసంతో పలకరిస్తాడు. ఈవిధంగా అమ్మ దర్శనం జరిగింది. పుట్టినరోజు నాడు యింతకన్నా మాకు లభించే అదృష్టమేమున్నది కదా! ఆరోజు కూడా మరొక మూవీ 'PK' హిందీసినిమా. జనవరి 14న తిరుగు ప్రయాణం. మరి జంతుప్రదర్శనశాల చూడాలి కదా! హోటల్ ఖాళీ చేసి, Zoo వెళ్లాము. అక్కడ Electric Buggy సదుపాయం వుంది. మధ్యమధ్యలో దిగి

ఫొటోలు తీసుకోవచ్చు. రకరకాల పక్షులూ, కోతులూ, పులీ, చిరుతా, భల్లూకం, మొసళ్లూ యింకా సరీసృపములూ అన్నీ వున్నాయి. యింకా జిరాఫీ, ఆఫ్రికన్ యేనుగులూ, తెల్లనెమలీ అన్నీ చూడగలిగాము. కానీ నాకు యెందుకో అసంతృప్తి కలిగింది. మొదటగా Zoo పరిసరాలు అంత పరిశుభ్రంగా లేవు. క్రూరజంతువులు వాటి సహజగుణమైన దూకుడూ అహంభావం లేక చాలా నీరసంగా వున్నాయి. సరైన కారణం నేను తెలుసుకోలేకపోయాను. మందకొడిగా వున్న వాటిని చూసిన నాకు చాలా బాధ కలిగింది. తమ సహజవాతావరణం అరణ్యంలో లేక సహజత్వాన్ని కోల్పోయాయేమో!! ఇది కేవలం నాఅభిప్రాయం మాత్రమే. దూర దూర ప్రదేశాలనుండి యెంతోమంది వచ్చి Zoo దర్శించుకుని సరదాగా ఆనందంగా తిరిగివెళ్తున్నారు, ముఖ్యంగా స్కూలుపిల్లలు. పిల్లలికి యింతకన్నా సంబరం యేముందికదా!

ఇవండీ మామైసూరు యాత్ర విశేషాలూ, కబుర్లూ.

నామనసులోని సంతోషం మీతో పంచుకున్నాను.

నాకు మరీ ఆనందంగా వుంది.



కొసమెరుపు....

ఈసంవత్సరం భోగి పండుగ జనవరి 14న పడింది.

మేము మైసూరు నుండి ఆరోజే సాయంత్రం యిల్లు చేరుకుని మాకు యెంతో యిష్టమైన భోగిమంట వేసుకున్నాము. మాపండుగ వేడుక పరిపూర్ణమైంది అన్న తృప్తి మాకు కలిగింది.

జైహింద్!

మీకృష్ణవేణి